సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం ॥ 30 ॥ జనవరి ॥ 2025



ఎవరిది విధ్వంసకర పాలన.. బాబూ!

ప్రజలకు గుర్తుండిపోయే పాలన అందించిన వారు ఎన్టీఆర్, వైఎస్సార్, వైఎస్ జగన్‌లు మాత్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. - 8లో



ఉపాధి సిబ్బంది నిరసన

కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డు అసిస్టెంట్ హత్యను ఖండిస్తూ బుధవారం ఉపాధి హామీ సిబ్బంది నిరసన తెలిపారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /17.3

జిల్లాలో బుధవారం 17.3 – 31.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

2న కుంభమేళాకు ప్రత్యేక సర్వీసు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహా కుంభ మేళాకు ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో నుంచి ప్రత్యేక సర్వీసును నడపనున్నామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఏడు రోజులపాటు కొనసాగే ప్రత్యేక వీడియో కోచ్ (2+2 పుష్ బ్యాక్ సూపర్ లగ్జరీ) బస్సు ఫిబ్రవరి 2వ తేది ఉదయం 8.00 గంటలకు బయలుదేరి నాగపూర్, జబలాపూర్, రేవా, ప్రయాగ రాజ్, వారణాసి మీదుగా అయోధ్యకు వెళుతుందని పేర్కొన్నారు. తిరుగుప్రయాణంలో 5వ తేదీ బయలుదేరి 8వ తేది కడపకు చేరుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుకు ఆన్‌లైన్ లేదా బస్టాండులోని కౌంటర్‌లో తమ టిక్కెట్ రిజర్వుచేసుకోవచ్చన్నారు. రాను, పోను టిక్కెట్ రూ. 10,000గా ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఐటీఐలో రెండేళ్ల కోర్సుల్లో 60 శాతం మార్కులతో పాసైన అభ్యర్థులకు పాలిటెక్నిక్‌లో 2వ సంవత్సరంలో బ్రిడ్జి కోర్సులో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని మైనార్టీ గవర్నమెంట్ ఐటీఐ కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు స్టేట్ టెక్నిక్ బోర్డు వారు నిర్వహించే ప్రవేశ పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమకు దగ్గరలోని ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల వద్దకు వెళ్లి సంప్రదించి వివరాలు నమోదు చేసుకుని త్వరలో ప్రారంభం కానున్న తరగతులకు హాజరుకావచ్చని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు.

నేడు గండిలో తలనీలాల టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఏడాది కాలం పాటు భక్తులు మొక్కుబడి కింద చెల్లించుకున్న తలనీలాల సేకరణ, కొబ్బరి చిప్పల సేకరణ హక్కుల కోసం గురువారం ఇ-టెండరు,షీల్డు టెండరు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. టెండర్లు స్థానిక కార్యాలయంలో ఉదయం 10-30 గంటల నుంచి జరుగుతాయని పేర్కొన్నారు. టెండర్లలో పాల్గొనే వారు తలనీలాలకు సంబంధించి రూ.25 లక్షలు,కొబ్బరి చిప్పలకు సంబంధించి రూ.3లక్షలు డిపాజిట్టు చెల్లించాలని చెప్పారు. దేవదాయ శాఖ నియమ నిబంధనల మేరకు నిర్వహించే టెండర్లకు ఆసక్తి గలవారు డిపాజిట్లు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

31లోపు టీఐఎస్‌లో మార్పులు చేసుకోండి

– డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు, మున్సిపల్, నగరపాలక సంస్థ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను తమ వ్యక్తిగత టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్) లాగిన్‌లో ఏవైనా మార్పులు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించామని డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ప్రభుత్వ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు, మున్సిపల్, నగరపాలక ఉపాధ్యాయులందరు తమ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ లాగిన్‌లో సరి చూసుకుని ఏవైనా మార్పులు ఉంటే సరి చేసుకోవాలని తెలిపారు. వీటి ఆధారంగానే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు జరుగుతాయని డీఈఓ షంషుద్దీన్ తెలిపారు.

సోమశిల జలాల్లోకి చేప పిల్లల విడుదల

నందలూరు : మండలంలోని కోనాపురం సోమశిల వెనుక జలాల్లోకి 19 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. మదన మోహనపురం గ్రామ సర్పంచ్ చుక్క నిర్మల, చుక్కా యానాది, ఉప సర్పంచ్ పుల్లయ్య చేతుల మీదుగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మత్స్య క్షేత్రాల నుంచి ఈ చేప పిల్లలను సేకరించారు.

అతిథి గృహాల పనుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్‌పై టూరిజం యూనిట్‌లో అతిథి గృహాల ఆధునికీకరణ పనుల్లో తీవ్ర జాప్యంపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికారులు స్వయంగా పర్యవేక్షణకు సిద్ధమయ్యారు. సోమ, మంగళవారాలు టూరిజం ఈఈ సుబ్రమణ్యంరాజు హార్సిలీహిల్స్‌పైనే ఉండి పనులు పర్యవేక్షించారు. సత్వరమే పూర్తి చేసి గదులను టూరిజంకు అప్పగించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. వారంలోగా కొన్నింటిని అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. మళ్లీ పనులపై పర్యవేక్షించి గదులు అప్పగించేందుకు ఇక్కడికి రానున్నారు. నెలలోగా ఆధునికీకరణ పనులన్నీ పూర్తి చేయించాక, అంతటితో మిగిలిన పనులు నిలిపివేసే అవకాశం కనిపిస్తోంది.

నత్తం..

తినేస్తున్నారు మొత్తం!



సర్వే నంబర్ 594లో గ్రామనత్తం భూమిని చదును చేసిన అక్రమార్కులు

- గ్రామనత్తం భూమిని చదును చేసిన టీడీపీ కార్యకర్తలు
- కోట్లాది విలువైన భూములు సొంతం చేసుకునేందుకు నకిలీ డాక్యుమెంట్లు
- అడ్రసు లేని వారి నుంచి కొనుగోలు చేసినట్లు సృష్టీకరణ
- అక్రమార్కులకు అండగా నిలుస్తున్న రెవెన్యూ యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప : తెలుగుదేశం నేతల అక్రమాలకు అడ్డూ అదుపూలేకుండా పోతోంది. ప్రభుత్వ భూమి కన్పిస్తే చాలు నకిలీ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. గ్రామనత్తం భూమికి సైతం స్వాహా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు రెవెన్యూ యంత్రాంగం సంపూర్ణ సహకారం అందిస్తోంది. గయాలు, వంక, చెరువు పరంబోకు భూములు అన్యాక్రాంతం చేయరాదని సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా పరిగణలోకి తీసుకోవడం లేదు. అక్రమార్కులకు కట్టబెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి గ్రామంలో సర్వే నంబర్ 594లో 1.91ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. పూర్వం రిజిస్టర్ ఆఫ్ హోర్డింగ్స్ (ఆర్‌హెచ్) ఆ సర్వే నంబర్ నిల్ చూపుతోంది. ఆ భూమికి 1982లో విక్రయించినట్లు ఓ డాక్యుమెంటు పుట్టుకొచ్చింది. మద్దికబోయిన నాగమహేశ్వరి శింగనమల రంగనాయకమ్మకు రూ.2వేలకు విక్రయించినట్లు డాక్యుమెంటు పుట్టింది. సర్వే నంబర్ 594లో 1.91 ఎకరాలు నాగమహేశ్వరికి ఆ భూమి ఎలా సంక్రమించిందన్న రికార్డుల్లేవు. పైగా రిజిస్టర్ డాక్యుమెంటులో నాగమహేశ్వరి స్థానంలో నాగమహేశ్వరయ్య పేరుతో సంతకాలు చేశారు. శింగనమల రంగనాయకమ్మ ఎవరూ ఆమె అడ్రసు పూర్వాపరాలు ఏమి అందుబాటులో లేవు. కాగా అదే భూమిని 1990 ప్రాంతంలో రెవెన్యూ అధికారులు గ్రామనత్తం కిందకు చేర్చారు. అంటే అప్పటికీ రెవిన్యూ విభాగం దగ్గర సదరు భూమి ఇతరులకు సంబంధించిన ఎలాంటి రికార్డులు లేవు. కాబట్టే సామాన్యులకు అందుబాటులో ఉండేలా గ్రామనత్తం కిందకు చేర్చడమే అందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

చదును చేసిన తెలుగుతమ్ముళ్లు...

కొప్పర్తి చెరువు అలుగు నీళ్లు అదే భూమి గుండా వెళ్లనున్నాయి. గ్రామస్థులు స్మశానానికి వెళ్లాలంటే కూడా అదే దారిలో వెళ్లాలి. గ్రామనత్తంగా ఉన్న ఆ భూమిని అధికార పార్టీ నేతలు కొందరు ఇటీవల యంత్రాలతో చదును చేశారు. అదేమంటే కొనుగోలు చేశామని చెబుతున్నట్లు పలువురు వివరిస్తున్నారు. చింతకొమ్మదిన్నె మండలంలో రింగు రోడ్డులో గద్దలు వాలినట్లు తెలుగుతమ్ముళ్లు వాలిపోయారు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా అలాంటి పరిస్థితే ఉంది. కారణం కోట్లలో భూముల ధరలు ఉండిపోవడంతో ప్రభుత్వ భూములను చెరబట్టారు. కట్టడి చేయాల్సిన రెవెన్యూ యంత్రాంగం అందుకు వత్తాసుగా నిలుస్తుండడంతో మరింతగా అక్రమార్కులు రెచ్చిపోతుండడం గమనార్హం.

వైభవంగా ధ్వజారోహణం

కడప కల్చరల్ : దేవతలారా రండి....కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవ వైభవాన్ని తిలకించండి అంటూ వేద పండితులు సకల దేవతలను ఆహ్వానించారు. తిరుమల తొలి గడప దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం నుంచి ప్రధాన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ అర్చకులు మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్ తదితరుల అర్చక బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ధ్వజపూజ నిర్వహించారు.

కొడిముద్దల పంపిణీ

బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణం సందర్భంగా భక్తులకు అందజేసే దీనిని గరుడుని ప్రసాదంగా కొడిముద్దలుగా పేర్కొంటారు. సంతానం లేని వారు ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే తప్పక ఫలం లభిస్తుందన్న విశ్వాసం ఈ ప్రాంత భక్తుల్లో ఉండడంతో మహిళలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆ ప్రసాదం కోసం పోటీలు పడ్డారు. అనంతరం అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామిని ఊరేగించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను ఊయలపై ప్రతిష్ఠించారు. భక్తిగీతాలాపనల మధ్య స్వామికి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారిని చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో వైభవోపేతంగా ఊరేగించారు.



చంద్రప్రభ వాహనంలో స్వామివారు

నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9.00 నుంచి 10.00 గంటల్లోగా సూర్యప్రభ వాహనం, స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల సేవ, అన్నమాచార్య కీర్తనల ఆలాపన, రాత్రి 8.00 గంటలకు పెద్ద శేష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది.

రథోత్సవానికి పకడ్బందీ చర్యలు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 4న నిర్వహించనున్న రథోత్సవానికి పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టనున్నామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన దేవునికడప ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆ క్షేత్రంలోని నాలుగు మాడవీధులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన, చేయనున్న పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 4న రథసప్తమి నాడు భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడారు. తొలుత ఎస్పీ ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న పూజల్లో పాల్గొన్నారు. చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డి, దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

ఆయుధాల పనితీరుపై అవగాహన ముఖ్యం

ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్ : పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో కడప నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ఏ.ఆర్ పోలీసు సిబ్బందికి మొబిలైజేషన్‌లో భాగంగా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ బుధవారం ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఏ.కె-47, మసాడా, గ్లాక్ పిస్టల్‌ల ద్వారా జిల్లా ఎస్పీ ఫైరింగ్ సాధన చేశారు. ఆయుధ నైపుణ్యాలను పరీక్షించారు. ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ గురించి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. అదనపు ఎస్పీ బి. రమణయ్య, ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్.ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

1 నుంచి కడప బాలోత్సవం


కడప కల్చరల్ : ఫిబ్రవరి 1, 2 తేదీలలో కడప బాలోత్సవం నిర్వహించేందుకు జిల్లా రచయితలు, మేధావులు ఏర్పాట్లు చేశారు. గతేడాది ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో రెండో ఏడాది మరిన్ని కార్యక్రమాలు, పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. విద్యార్థులకు కడప నగరం మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీని చివరి గడువుగా నిర్ణయించారు. కార్యక్రమానికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి 5–8 వేల మంది హాజరు అవుతారని నిర్వాహకుల అంచనా. పోటీలను 3 నుంచి 10వ తరగతి వరకు సీనియర్, జూనియర్, సబ్ జూనియర్‌లుగా మూడు విభాగాలలో నిర్వహిస్తారు.

తొలి రోజు పోటీలు .. ఫిబ్రవరి 1న శనివారం... సైన్స్ ప్రదర్శన, మట్టితో బొమ్మలు చేయడం, వ్యాస రచన, కథా రచన, కథా పఠనం, వార్తా పఠనం, కథలు చెప్పడం, బెస్ట్ ఫ్రం వేస్ట్, కార్టూన్లు గీయడం, మెమొరీ టెస్ట్, శాస్త్రీయ, జానపద నృత్యాలు, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, ఫాన్సీడ్రస్, తెలుగులో ఏకపాత్రాభినయం, తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ రైమ్స్ ఉంటాయి.

– రెండవ రోజు ఆదివారం... చిత్రలేఖనం, వక్తృత్వం, తెలుగు డిక్టేషన్, మ్యాప్ పాయింటింగ్, కోలాటం, జానపద నృత్యం, లఘు నాటికలు ఉంటాయి. మొదటి రోజు పోటీలు ముగిసిన వెంటనే ఆ రోజుకు సంబంధించిన ప్రోత్సాహక బహుమతులను అప్పుడే అందజేస్తారు. మొత్తం బహుమతులను ఆదివారం అన్ని పోటీలు ముగిసిన తర్వాత ప్రముఖుల ద్వారా అందజేస్తారు. ఇతర వివరాలకు 9490 1340 లేదా 90008 5552 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ఉచిత బియ్యంలో పాపాల పురుగులు

- రేషన్ షాపుల్లో డీలర్ల నయా దందా
- చనిపోయిన వారి పేర్లతో బియ్యాన్ని కాజేస్తున్న డీల్లర్లు
- వి.ఆర్.ఓ వేలిముద్రలతో బియ్యం దోపిడీ
- పంపకాల్లో అధికారులకు వాటా ఇస్తున్న డీలర్లు



గాజులపల్లె సీతమ్మ పేరుతో రేషన్ బియ్యం డ్రా చేసిన ఈ పాస్ యంత్రం స్లిప్



చిన్నకొండారెడ్డి పేరుతో రేషన్ బియ్యం డ్రా చేసిన ఈ పాస్ యంత్రం స్లిప్.

కలసపాడు : పేదలకు పంచాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కార్డుదారులకు చేరాల్సిన బియ్యం బస్తాలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయి. మరోవైపు చనిపోయిన వారి పేర్లతోనూ డీలర్లు బియ్యం దందా చేయడం బద్వేలు డివిజన్ పరిదిలోని కలసపాడు మండలం మహానందిపల్లె రేషన్ షాపులో తాజాగా వెలుగులోకి వచ్చింది. బద్వేలు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 172 రేషన్‌షాపులు ఉన్నాయి. ఈ మొత్తం రేషన్ షాపులకు 1080 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇందులో 40 శాతం బియ్యం వివిధ రూపాల్లో పక్కదారి పడు తున్నట్లు తెలుస్తోంది.

వెలుగులోకి సరికొత్త దందా

పేదల బియ్యాన్ని బొక్కేందుకు డీలర్లు రోజుకో పంథాలో వెళుతున్నారు. రకరకాల కుట్రలకు తెరతీస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బద్వేలు నియోజకవర్గంలో బియ్యం మాఫియా చెలరేగిపోతోంది. ఇందులో భాగంగా కలసపాడు మండలం మహానందిపల్లె రేషన్ షాపు డీలరు చనిపోయినవారి పేర్లతో బియ్యం డ్రా చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గాజులపల్లె సీతమ్మ చనిపోయి నాలుగేళ్లయింది. అదే గ్రామానికి చెందిన దేవసాని చిన్న కొండారెడ్డి చనిపోయి ఏడాది పూర్తైంది. వీరి పేర్లతో వీఆర్ఓ.బయోమెట్రిక్ ద్వారా డ్రా చేస్తున్నట్లు తెలిండి. ఇవి మచ్చుకు మాత్రమే.

దందా జరుగుతున్న తీరిది

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 75 శాతం మంది డీలర్లను మార్చి తమ పార్టీ కార్యకర్తలను డీలర్లుగా నియమించుకుంది. పేదలకు బియ్యాన్ని పంపిణీ చేసినందుకు డీలర్లకు క్వింటాకు రూ.140ల లెక్కన ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇది సరిపోదన్నట్లు డీలర్లు అడ్డదార్లు తొక్కుతున్నారు. కార్డు దారులు వేలిముద్రలు వేశాక తూకంలో బియ్యం వేసినట్లు రికార్డులో నమోదు చేసి సదరు కార్డుదారులకు డబ్బులు చెల్లిస్తున్నారు. ఆ బియ్యాన్ని అధికరేట్లకు దొడ్డిదారిన విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే చనిపోయిన వారి లిస్టు తీసి వారి పేర్లను తొలగించకుండా వీఆర్ఓ.ల బయో మెట్రిక్ ద్వారా బియ్యాన్ని డ్రాచేసి విక్రయిస్తున్నారు.

ప్రతినెలా 40 శాతం బియ్యం పక్కదారి

నియోజకవర్గంలో అంత్యోదయ,అన్నపూర్ణ ఆహార భద్రతా కార్డులు దాదాపు 10 వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది.వీటికి ప్రభుత్వం 350 టన్నులకు పైగా బియ్యాన్ని నియోజకవర్గంలోని 172 రేషన్ షాపులకు కేటాయిస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.39.35పై వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వం కేటాయించిన బియ్యంలో దాదాపు 40 శాతం బియ్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. కలసపాడు, కాశినాయన,పోరుమామిళ్ల,బి.కోడూరు మండలాల నుంచి రేషన్ బియ్యం చాలా వరకు బెంగుళూరు,చెన్నై,హైదారాబాద్ తదితర నగరాలకు ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది

బియ్యం డ్రా చేసింది నిజమే

కలసపాడు మండలం మహానందిపల్లె రేషన్ షాపులో చనిపోయిన వారి పేర్లతో బియ్యం డ్రా చేసినట్లు తమకు సమాచారం వచ్చిందని తహసిల్దార్ మధురవాణి తెలిపారు.అక్కడికి వెళ్లి విచారించగా బియ్యం డ్రా చేసినట్లు తేలిందన్నారు. ఈ విషయాన్ని బద్వేలు ఆర్‌డిఓ.కు సమాచారం అందించామని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రాజెక్టులో భద్రతా ప్రమాణాలు ముఖ్యం

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వేముల: పర్యావరణానికి ఎలాంటి ముప్పు తలెత్తకుండా యురేనియం (యు సిఐఎల్) ప్రాజెక్టును నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం వేముల మండలం తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(యు.సి.ఐ ఎల్) ప్రాజెక్టును కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సందర్శించి సంబంధిత అధికారులతో ప్రాజెక్ట్ పనులు, ఉత్పత్తులు, ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ గనుల్లో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ, భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. ప్లాంటేషన్(మొక్కల పెంపకం) కార్యక్రమాన్ని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేపట్టాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. యురేనియం గనులవల్ల పరిసర గ్రామాలు ప్రభావితం కాకుండా చూడాలన్నారు. అలాగే జిల్లా విపత్తు నిర్వహణ కమిటీతో సమన్వయం చేసుకుంటూ మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అంతకముందు యు.సి.ఐ.ఎల్ అధికారులు ప్రాజెక్టుపై పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. యురేనియం ప్రాజెక్టుకు ఏ పల్లెలు దగ్గరగా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని టన్నుల యురేనియం ఉత్పత్తి అవుతోందని అధికారులు అడిగి తెలుసుకున్నారు. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాసుల రావు, యుసీఐఎల్ అధికారులు సుమన్ సర్కార్, కిశోర్ భగత్, శ్రీకాంత్, మాతివన్నన్ సంజయ్ చటర్జీ, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ మాధవి, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



వేంపల్లెలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, తదితరులు

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

వేంపల్లె : వేంపల్లె పట్టణంలో ఆగిన రోడ్డు విస్తరణ, ప్రధాన రహదారుల నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గండి రోడ్డులో ఆగిపోయిన విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవిని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో నాలుగు రోడ్ల కూడలి నుంచి బైపాస్ వరకు 900 మీటర్లు మేర 72 అడుగుల రోడ్డు విస్తరణ పనులకు రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసిందని, రోడ్డు విస్తరణలో గృహాలు, వాణిజ్య సముదాయాలు కోల్పోయిన లబ్దిదారులకు రూ.18కోట్లు పరిహారం కూడా అందించారని ఈఈ సమాధానమిచ్చారు. ఇక్కడ ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని, సంబంధిత కాంట్రాక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణ పనులను మొదలు పెట్టించాలని ఆర్ అండ్‌బీ ఈఈ మాధవికి కలెక్టర్ ఆదేశించారు.

క్లుప్తంగా

కారు అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన కారు అద్దాలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎరికరెడ్డి వీరారెడ్డి కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. బాధితుడి కథనం మేరకు.. వీరారెడ్డికి చెందిన హోండా ఎక్ట్స్రా కారును తన ఇంటి వద్ద పెట్టుకున్నాడు. శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బుధవారం పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు

కాశినాయన : మండలంలోని అంబవరం గ్రామ సమీపంలోని తెలుగుగంగ ఎడమ కాలువలో మృతదేహం లభ్యమైనట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం దేవరపల్లె గ్రామానికి చెందిన దేశిరామయ్య, లక్ష్మీదేవి దంపతులు రెండు నెలల క్రితం స్వగ్రామం నుంచి వచ్చి తోట్లపల్లె గ్రామంలోని అచలానంద ఆశ్రమంలో ఉండేవారు. మంగళవారం దుస్తులు ఉతుక్కునేందుకు తెలుగుగంగ ఎడమ కాలువలోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు రామయ్య (62) నీళ్లలో పడిపోయాడు. బుధవారం అంబవరం సమీపంలోని తెలుగుగంగ ఎడమ కాలువలో మృతదేహం ఉన్నట్లు గుర్తించి వెలికితీశామని సీఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామానికి చెందిన రుషిమణి(17) అనే యువతి అదృశ్యమైంది. ఈమేరకు ఆమె తండ్రి మునెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. చిలంకూరు గ్రామానికి చెందిన రుషిమణి చిలంకూరు గ్రామంలో ఉన్న జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 27వ తేదీన కళాశాలకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. ఆ తర్వాత ఇంటికి రాలేదు. చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం యువతి తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎవరిది విధ్వంసకర పాలన.. బాబూ!

- 2.78 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ఇచ్చిన వైఎస్ జగన్‌దా.. ఏమీ ఇవ్వని నీదా..
- నీ పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క పథకమైనా ఉందా
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రజలకు గుర్తుండిపోయే పాలన అందించిన వారు ఎన్‌టీఆర్, వైఎస్సార్, వైఎస్ జగన్‌లు మాత్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషాతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.2లకే కిలో బియ్యం, మద్యపాన నిషేధం వంటి పథకాలతో ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన నేతగా ఎన్‌టీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలు ప్రవేశపెట్టిన వైఎస్సార్‌ను, రూ.2.78లక్షల కోట్లను డీబీటీ రూపంలో, నాన్ డీబీటీ రూపంలో రూ.1.50 లక్షల కోట్లను ప్రజలకు నేరుగా అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. కానీ చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క సంక్షేమ పథకం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని 15ఏళ్లకు పైగా పాలించిన చంద్రబాబు ప్రజలకు మేలు చేసే ఒక్క పని కూడా చేయలేదన్నారు. ఆయన పేరు చెబితే మోసం, అబద్ధాలు, వెన్నుపోటు గుర్తుకు వస్తాయన్నారు. అమరావతికి కూడా బాబు చేసిందేమీ లేదని, ఎన్‌టీఆర్‌ను, వారి పిల్లలను తన ఎదుగుదలకు మాత్రమే ఉపయోగించుకుంటారని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం విధ్వంసమా...8 నెలల్లో రూ.73వేలకోట్లు అప్పులు చేయడం విధ్వంసమా చెప్పాలన్నారు. పింఛన్ మొత్తం పెంచామనే సాకుతో పింఛన్ల సంఖ్యను దారుణంగా కోత కోశారని మండిపడ్డారు. టీడీపీ పాలనలో వేల పరిశ్రమలు మూతపడ్డాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వార్షిక సగటు మూలధన వ్యయం రూ.15632కోట్లు ఉంచితే, చంద్రబాబు రూ.13860 కోట్లు మాత్రమే ఉంచారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో పన్నుల రూపంలో రూ.92972 కోట్లు వస్తే, టీడీపీ పాలనలో రూ.58107 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. దీన్ని బట్టే సంపద సృష్టికర్త ఎవరో ప్రజలు గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, జయచంద్రారెడ్డి, నాగేంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, సీహెచ్ వినోద్, షఫీ పాల్గొన్నారు.

కోట్లు విలువజేసే స్థలాన్ని టీడీపీ ఆఫీసుకు కేటాయిస్తారా?

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని అక్కాయపల్లెలో రూ.80కోట్లు విలువ జేసే అత్యంత ఖరీదైన స్థలాన్ని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి కేటాయించడం అన్యాయని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా విమర్శించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్కాయపల్లెలో ఆర్‌అండ్‌బి ఈఈ కార్యాలయం, న్యాక్ సెంటర్ ఉన్న ప్రాంతంలో టీడీపీ ఆఫీసుకు 2.00 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ ఇవ్వడం దారుణమన్నారు. నగర నడిబొడ్డున ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఈ స్థలాన్ని ఒక పార్టీ ఆఫీసుకు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాలకు స్థలాలు కేటాయించడం సర్వసాధారణమేనని, అయితే ఇంత విలువైన స్థలాన్ని కేటాయించడం తగదన్నారు. 2014–19 మధ్య కాలంలో పాత మున్సిపల్ కార్యాలయాన్ని టీడీపీ ఆఫీసుకు కేటాయించారని, దానిపై ప్రజా సంఘాల నుంచి అభ్యంతరాలు రావడంతో అక్కాయపల్లెలో న్యాక్ ట్రైనింగ్ సెంటర్ పక్కనున్న పౌరసరఫరాల శాఖ స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు. తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాటం చేయడంతో వారి ఆటలు సాగలేదన్నారు. అప్పుడు టీడీపీ ఆఫీసుకు కేటాయించిన స్థలంలో తాము వాటర్ ట్యాంక్, పార్కు నిర్మించామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి రామాంజనేయపురం వద్ద లోపలి భాగంలో స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రాగానే దాని పక్కనే ఉన్న న్యాక్ ట్రైనింగ్ సెంటర్ స్థలాన్ని 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వం జీఓ ఇవ్వడమే తడవుగా టీడీపీ నాయకులు అందులోని షెడ్‌ను, పాత వాహనాలు, ఇతర ఫర్నీచర్‌ను మాయం చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై విచారణ చేసి ప్రభుత్వం సొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర శివార్లలో టీడీపీ కార్యాలయానికి స్థలం కేటాయిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అలాగే ఆరు నెలల్లో సొంత నిధులైనా వెచ్చించి కడప బుగ్గవంకపై బ్రిడ్జిలు నిర్మిస్తానని ప్రగాల్భాలు పలికిన ఎమ్మెల్యే మాధవి మాట నిలబెట్టుకోవాలని సూచించారు.

రాజంపేట 3వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్. ప్రవీణ్ కుమార్



కడప అర్బన్: రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎస్. ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్. ప్రవీణ్‌కుమార్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా కడపలో పని చేస్తున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌జెండర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లను ఇప్పించడం, ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌జెండర్స్ కాలమ్ పెట్టించడం తదితర ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక గుర్తింపు పొందారు.

కారును ఢీకొన్న కంటైనర్

- విద్యుత్ శాఖ ఉద్యోగి మృతి
- మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన సుబ్రమణ్యం రాజు

ఓబులవారిపల్లె : మంగంపేట చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని జాతీయ రహదారిపై కారును కంటైనర్ ఢీ కొనడంతో సుబ్రమణ్యం రాజు (49) మృతి చెందగా రెడ్డయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కడపకు చెందిన సుబ్రమణ్యం రాజు తిరుపతిలో విద్యుత్ శాఖలో యూడీసీగా పని చేస్తున్నారు. తన స్నేహితుడు, రైల్వేకోడూరు సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న అనంతరాజుపేట దళితవాడకు చెందిన రెడ్డయ్యతో కలిసి రాజంపేట నుంచి తిరుపతికి కారులో వెళ్తుండగా చెన్నకేశవ స్వామి ఆలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న భారీ కంటైనర్ లారీ ఢీ కొంది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యం రాజు అక్కడికక్కడే మృతి చెందగా రెడ్డయ్య మెడ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మహేష్ తెలిపారు. ప్రమాద స్థలానికి ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే ప్రభుత్వ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయసింహ తెలిపారు. కాపు, బలిజ, ఒంటరి, తెలగ, రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన వారు జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను పొందవచ్చని పేర్కొన్నారు . ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7 వ తేదీలోపు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ అనంతరం ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 9వ తేదీలోపు అర్హులైన వారి బ్యాంక్ అకౌంట్‌లో ప్రభుత్వం సబ్సిడీ నిధులను విడుదల చేస్తుందన్నారు.

మొదటి సంతకం హామీ ఏమైంది బాబూ!



బద్వేలు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్/జమ్మలమడుగు : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మెగా డీఎస్సీపై చేసిన మొదటి సంతకం హామీ ఏమైందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ ప్రశ్నించారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే ప్రకటించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం బద్వేలు, జమ్మలమడుగు ఆర్డీఓలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే తొలుత మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని యువతకు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా దాని ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 16 వేల ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇనగలూరులో టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ



దాడిలో గాయపడిన దస్తగిరిరెడ్డి

తొండూరు : తొండూరు మండలంలో అధికార తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చీనీచెట్ల బిల్లుల విషయమై వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో బుధవారం తొండూరు పెట్రోలు బంకు సమీపంలో ఇనగలూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కదిరి దస్తగిరిరెడ్డి అలియాస్ బాబురెడ్డిపై కర్రలతో దాడి చేశారు. చీనీ చెట్ల బిల్లుల విషయంలో మాజీ ఎంపీటీసీ దస్తగిరిరెడ్డి అడ్డుపడుతున్నాడని అదే గ్రామంలోని టీడీపీ నాయకుడు బాల ఓబుళరెడ్డి వర్గీయులు భావించారు. దీంతో దస్తగిరిరెడ్డి ఇనగలూరు నుంచి తొండూరుకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా వెనుకవైపు నుంచి వచ్చిన బాల ఓబుళరెడ్డి వర్గీయులు కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో దస్తగిరిరెడ్డికి కాలు, చేయి విరగడంతోపాటు తలకు రక్త గాయమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగిన తర్వాత ఇనగలూరులోని దస్తగిరి రెడ్డి అనుచరులు బాల ఓబుళరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఇంటి తలుపులను పగులగొట్టి ఇంట్లోని టీవీ, కుర్చీలతోపాటు వంట సామగ్రిని ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై పులివెందుల సీఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. దస్తగిరిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



డిజిటల్ తరగతి గదిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్, తదితరులు

సింహాద్రిపురం : విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురంలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాలను బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అలాగే పాఠశాల భవన సముదాయంలో ఉన్న చదువులతల్లి సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించి లైబ్రరీ, డిజిటల్ క్లాస్ రూం, తదితర భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు మెరుగైన విద్యను బోధించాలన్నారు. పది పరీక్షలు త్వరలోనే ఉన్నాయని, ఈ మూడు నెలలపాటు విద్యార్థులు బాగా చదవడం వల్ల మంచి మార్కులు సాధించగలరన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చిన్నయ్య, డీఈఓ షంషుద్దీన్, తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జోగిరెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డు అసిస్టెంట్ హత్యను ఖండిస్తూ ఉపాధి సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ సిబ్బంది

దువ్వూరు(చాపాడు): కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డు అసిస్టెంట్ హత్యను ఖండిస్తూ బుధవారం దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే సిబ్బంది నిరసన తెలిపారు. కర్నూలు జిల్లాలో ఫీల్డు అసిస్టెంటు హత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. హత్యకు గురైన ఫీల్డు అసిస్టెంట్ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ వసంత కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ మహిళ ఎవరు?

- గంగాధర్ ఆత్మహత్య విషయంలో 'ఆమె' పాత్రే కీలకం
- త్రిబుల్ స్టార్ పోలీస్ అధికారితో సాన్నిహిత్యం
- మహిళ ఒత్తిడితోనే గంగాధర్‌పై హత్యాయత్నం కేసు నమోదు
- గతంలోనూ సదరు అధికారిపై లైంగిక ఆరోపణలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'కంచె చేను మేసింద'న్న చందంగా చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు అధికారులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పులివెందుల సబ్ డివిజన్‌లో యథేచ్ఛగా ఇలాంటి ఘటనలు తెరపైకి వస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉంటే చాలు ఎలాంటి అడ్డదారులు ఎంచుకున్నా పర్వాలేదన్న ధోరణి అధికంగా కన్పిస్తోంది. ఈ క్రమంలో అసలైన హత్యాయత్నం కేసులు నీరు గార్చడం, వాదులాటలపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడం సర్వసాధారణమవుతోంది. అందులో భాగంగా మోట్నూతలపల్లెకు చెందిన గంగాధర్ ఆత్మహత్య వెలుగులోకి వచ్చింది.

తెరవెనుక చక్రం తిప్పిన మహిళ..

పులివెందుల మండలం మోట్నూతలపల్లి గ్రామానికి చెందిన గంగాధర అనే వ్యక్తి మంగళవారం పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తే విస్తు పోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. మృతి చెందిన గంగాధర్‌కు ఓ మహిళకు మధ్య విభేదాలున్నాయి. సదరు మహిళకు త్రిబుల్ స్టార్ అధికారితో కొద్ది కాలంగా సాన్నిహిత్యం ఉన్నట్లు సమాచారం. ఆమె విభేదాలతో నిమిత్తం లేకుండా మరో చిన్న కొట్లాటలో గంగాధర్ చిక్కుకున్నాడు. అంతే తెరవెనుక సదరు మహిళ చక్రం తిప్పింది. అంతే వేగంగా గంగాధర్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. అంతటితో పోలీసు అధికారుల చర్యలు ఆగిపోలేదు. త్రిబుల్ స్టార్ అధికారితో సాన్నిహిత్యం ఉన్న మహిళను సంతృప్తి పర్చేందుకు గంగాధర్‌కు పోలీసుల వేధింపులు అధికమయ్యాయి. వెరసి పోలీసుస్టేషన్ ఎదుటే పురుగుల మందు తాగి చనిపోవడం గమనార్హం.

గతంలోనూ లైంగిక ఆరోపణలు..

ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు త్రిబుల్ స్టార్ అధికారి గతంలో రాయచోటి ప్రాంతంలో పనిచేస్తుండగా లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్నారు. తన కింది స్థాయి సిబ్బంది కుటుంబ సభ్యురాలితో సాన్నిహిత్యం కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న సదరు సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. తర్వాత కాలంలో సైతం ఆమెతో సాన్నిహిత్యం కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పటికీ సంబంధబాంధవ్యాలు కొనసాగుతున్నట్లు సమాచారం. సదరు మహిళకు రాయచోటిలో ఏకంగా ఇల్లు నిర్మిస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆ ఇంటి నిర్మాణానికి పులివెందుల టీడీపీ నాయకులు చేస్తున్న అనైతిక కార్యకలాపాల ద్వారా లభించే సొమ్ము వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది.

గంగాధర్ కుటుంబాన్ని ప్రసన్నం చేసుకునే దిశగా..


పులివెందులలో పోలీసు స్టేషన్ ఎదుట ఆత్మహత్య చేసుకున్న మోట్నూతలపల్లె గంగాధర్ కుటుంబాన్ని ప్రసన్నం చేసుకునే పనిలో త్రిబుల్ స్టార్ అధికారి నిమగ్నమైనట్లు సమాచారం. గంగాధర్ మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. దాంతో బిత్తర పోయిన సదరు అధికారి మొత్తం వ్యవహారం బహిర్గతమవుతుందని నోట్ల కట్టలతో నోరు మూయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర హోంమంత్రి అనిత మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు, చట్టాన్ని అతిక్రమించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించమని నిత్యం ప్రకటిస్తుంటారు. అయితే పోలీసుశాఖకు ఎలాంటి మచ్చ తెచ్చినా టీడీపీ నేతల సిఫార్సులుంటే ఎలాంటి చర్యలు ఉండవని పులివెందుల సబ్ డివిజన్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న పలు ఉదంతాలు చెప్పకనే చెబుతున్నాయి.

ఎస్పీ గాడిలో పెడతారా?!

జిల్లాలో కొంతమంది పోలీసు అధికారులు ఖాకీ వనంలో కలుపు మొక్కలుగా తయారయ్యారు. చట్టాన్ని పరిరక్షించాల్సింది పోయి వారే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అక్రమ ఆదాయం కోసం అడ్రులు దాస్తూ, ఈజీ మనీ కోసం అడ్డదారులు ఎంచుకున్నారు. అధికార పార్టీ నేతల అండదండలు ఉంటే చాలు ఉద్యోగ నిర్వహణ ఎలా ఉన్నా ఇబ్బంది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా నూతన ఎస్పీగా ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. మొత్తం వ్యవస్థకే మచ్చ తెస్తున్న కలుపు మొక్కలను.. కళంకితులను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మరి జిల్లా పోలీసు బాసు ఏమేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

జానపద సాహిత్య పరిశోధనాశాల 'తంగిరాల'


- శాశ్వతంగా ఆగిన కలం
- ఈనెల 25న కన్నుమూత
- సాహితీలోకం ఘన నివాళులు



తంగిరాల సుబ్బారావు

కడప సెవెన్‌రోడ్స్ : రేనాటి సూర్యచంద్రులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శౌర్యప్రతాపాన్ని, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి అనితర సాధ్యమైన దాతృత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన విలక్షణ రచయిత తంగిరాల. జానపదంలోని సమాచారానికి చారిత్రక విలువలు కల్పించి సాహిత్య గౌరవం కల్పించిన ఘనాపాటి ఆయన. తెలుగు వారైన ఇద్దరు మహోన్నత వ్యక్తుల ఘనతను ప్రపంచానికి చాటి వారికి ప్రజల హృదయాల్లో శాశ్వతత్వం కల్పించిన జానపద సాహిత్య పరిశోధకులు తంగిరాల. సుప్రసిద్ధ జానపద సాహిత్య పరిశోధకులు, బెంగళూరు విశ్వవిద్యాలయ తెలుగు పూర్వ విభాగాధిపతి ఆచార్య తంగిరాల సుబ్బారావు ఈనెల 25న కన్నుమూశారు.

రాయలసీమతో తంగిరాలకు ఉన్న అనుబంధం విడదీయలేనిది. ఆంగ్లేయులపై గొప్ప తిరుగుబాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి గురించిన విషయాలు దాదాపుగా కనుమరుగైపోతున్న పరిస్థితుల్లో సుబ్బారావు వారి గురించిన విషయాలను నేటి తరానికి 'రేనాటి సూర్యచంద్రులు' అనే పరిశోధన గ్రంథం రూపంలో అందించారు. ఆయన జమ్మలమడుగు, రూపనగుడి, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, నంద్యాల, ప్రొద్దుటూరు తదితర రేనాటి ప్రాంతాల్లో ఆరు నెలలపాటు విస్తృతంగా పర్యటించి పరిశోధన చేశారు. పిచ్చిగుంట్ల వారి నుంచి సైతం పాటలు సేకరించారు. ఇలా ఆయన చేసిన విశేష కృషికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానంతో గౌరవించింది. కడప జిల్లాతో ఆయనకున్న అనుబంధం విడదీయరానిది. ఆయన మృతి పట్ల పలువురు సాహితీవేత్తలు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.



తంగిరాల రచించిన రేనాటి సూర్యచంద్రులు పరిశోధన గ్రంథం

ఆకాశ వీధిలో అందాల ఆకృతి



వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న ఎద్దులకొండకు ఎదురుగా వింత ఆకృతి

వేంపల్లె : సూర్యోదయ సమయంలో బుధవారం ఆకాశంలో ఒక విచిత్రమైన ఆకారం కనిపించింది. వేంపల్లెలోని పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న ఎద్దుల కొండకు ఎదురుగా ఉదయం 5:30 గంటల నుంచి 6.30 గంటల వరకు నాగుపాము పడగెత్తినట్లుగా ఆకాశంలో ఆకృతి కనిపించింది. అంతేకాకుండా ఆ ఆకృతి నుంచి కిరణాలు వచ్చి ఎద్దుల కొండపై పడ్డాయి. అందరూ ఆసక్తిగా చూస్తూ ఈ దృశ్యాన్ని సెల్ ఫోన్లలో చిత్రీకరించేందుకు ఎగబడ్డారు. మౌని అమావాస్య రోజున ఆకాశంలో ఇలాంటి అద్భుతం జరగడం ప్రజల్లో చర్చనీయాంశమైంది.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

లింగాల : లింగాల ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి బుధవారం ఇద్దరు వీఆర్‌ఓలు, ఇద్దరు గ్రామ సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అయితే నోటీసులు అందుకున్న వారు సమగ్ర భూసర్వే కార్యక్రమంలో పాల్గొంటున్నామన్నారు. నోటీసుల విషయాన్ని డివిజనల్ ఇన్‌స్పెక్టర్ హేమలత దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై తహసీల్దార్ ఈశ్వరయ్యతో చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.